

# కత్తుల వంతెన

నవల

మహీధర రామమోహనరావు

# కత్తుల వంతెన

(నవల)

మహీధర రామమోహనరావు

విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్
విజయవాడ

# కత్తుల వంతెన

## ఒకటో ప్రకరణం

“ఎన్ని చెప్పినా వినిపించుకోవు చూడు. మీ ఇంజనీయరుగారి యోగ్యత.”

ఉద్రేకంతో సుజాతకంఠం పట్టేసింది. ఆ ఆవేశానికి వంతపలుకుతున్నట్లు కట్టుకొన్న తడిబట్ట బుసబుస లాడింది.

నిలువునీళ్ళతో విసవిసావచ్చి ఎదుట నిలబడిన సుజాత సవ్వడికీ, ఆమె కుపితస్వరానికి వులికిపడి కల్యాణి తలఎత్తింది. తడిసి, వంటినంటియున్న వలిపంలో ఆమె మొగ్గవిడుతున్న పువ్వులా వుంది. ఆరోగ్యం చిందుతున్న స్త్రీత్వం వొంపులు తీరలేదు ఇంకా.

ఆమె పెదవులు కోపంతో వణుకుతున్నాయి. అభిమానరేకలు కళ్ళల్లో నీలిగా మసలుతున్నాయి.

“బట్టలన్నా మార్చుకోకుండా వచ్చేశావేం?”

సుజాత ‘గంయ్’ మంది.

“అదిగో మాట మరిపిస్తున్నావు. నువ్విస్తున్న అలుసుదనమే.”

కల్యాణి చిరునవ్వు నవ్వింది.

ప్రక్కవాటాలో కాపురంవున్న ఇంజనీరు యువకుడు వట్టి జడభరతుడని ఆమె అవహేళన చేస్తుంది. తామెవ్వరూ లేవకపూర్వమే అతడు పనిమీదకు వెళ్ళిపోతాడు. అంతా నిద్రలు పోయాక ఎప్పుడో అపరాత్రివేళ తిరిగివస్తాడు. డ్యూటీలేని రోజుల్లో తప్ప ఆయన కనిపించడు. మనిషి నెమ్మదైనవాడు. ఫలితంగా సుజాత ఆయనకు ‘జడభరతుడ’ని పేరు ప్రసాదించింది. ఆ జడభరతుడు ఈవేళ తాను నూతివద్ద నీళ్ళు పోసుకుంటుండగా చూసేడని కోపం చేస్తూంటే కల్యాణి చిరునవ్వు నవ్వింది.

రాత్రి పదిగంటలయింది. ఆయన ఇప్పుడే వచ్చాడు, తానే తలుపు తీసింది. ఆ మనిషికి సుజాత ఏం చేస్తూందో తెలుసు ననడానికి అవకాశం లేదు. పైగా రాజగోపాలం అంటే కల్యాణికి ఒక సదభిప్రాయం వుంది. మిగిలిన రెండువాటాల్లోనూ ఆడవాళ్ళేగాని, మగవాళ్ళు లేరు. వున్నవాళ్ళుకూడ ఒక్క రామలక్ష్మమ్మతప్ప వయసులో వున్నారు. దాని నాతడవకాశం చేసుకొని అతిపరిచయం పెంచుకోవడానికి ప్రయత్నించలేదు. కొంతమందిలాగ తన వాటాలో నలుగురినీ చేర్చి అల్లరి చేయడంలేదు. ఆ భయంతోనే తాను మొదట అతనిని మూడోవాటాలో చేర్చుకోడానికి ఒప్పుకోలేదు. తన స్నేహితు లొకరిమాట తోసెయ్య లేక సాహసించింది. రాజగోపాలం తానుంచిన విశ్వాసాన్ని కాపాడు కొంటున్నాడు. ఇప్పుడు సుజాత అతడు మగపోడిములు మొదలెట్టాడంటూంది. తనకు నమ్మకం లేదు. కాని, ఆ మాట పైకి అనలేదు.

"బట్టతోనే పోసుకుంటున్నావు కదా!"

తన అభిమానాన్ని చులకన చేస్తున్నట్లు తీసుకొని సుజాత చర్రుమంది.

"ఒంటి నంటుకున్న తడిబట్టలతో వీధులనిండా మగవాళ్ళున్నా ఏ చెరువునుంచో నీళ్ళు తెచ్చుకోవడం మీ బ్రాహ్మలకి అలవాటు."

తమ అగ్రహారం జీవితపు అలవాట్లను గురించి ఈ మాదిరి అవహేళనలు వీరేశలింగంగారి కాలంనుంచీ వినబడుతూనే వున్నాయి. తమ వూరు అంతకూ మంచినీళ్ళకు ఆధారం తూర్పు దిక్కునున్న పెద్ద చెరువు. చెంబెడు మంచినీరు కావాలన్నా చెరువునుంచి రావలసిందే. మొన్న మొన్నటివరకూ వాడకం నీళ్ళక్కూడా దొడ్లో నూతులుండేవి కావు. వీధినూతులవద్ద మగవాళ్ళు స్నానంచేసేవారు. ఆడవాళ్ళు చెరువులో స్నానంచేసి రెండుబిందెల నీళ్ళు తెచ్చుకొని వంటల కుపక్రమించేవారు. ఆచారం, ధనహీనత మూలంగా నీళ్ళకు మనుష్యుల్ని పెట్టుకోలేరు. ఫలితంగా ఎందరెన్ని వెక్కిరించినా, మంచినీళ్ళ సరఫరాకు తగిన సౌకర్యాలు ఏర్పడితే తప్ప అక్కడ ఈ అలవాటు పోవడంలేదు.

ఈ అలవాటును గురించి తప్పు పట్టుకొంటేనూ, అవహేళనచేశారని కోపం తెచ్చుకొంటేనూ లాభం లేదు.

కల్యాణి ఇంతవరకూ సుజాత అభిమానాన్ని అంతగా లెక్కచేయలేదు. సుజాత మాటదురుసుతనం వున్నా ఇంతవరకు కులంపేరు పెట్టి మాటలని వుండలేదు. తమ భిన్నకులాల్ని పేర్కొనూ లేదు. ఆ మాటతో కల్యాణి సర్దుకు కూర్చుంది.

"ఏం జరిగిందేం... ....?"

ప్రశ్నించిందేగాని, ఆ సమయంలో ఆమె ముఖభంగిమ చూస్తే నవ్వు వచ్చింది.

# రెండో ప్రకరణం

సుజాత అన్నట్లు ఒకటి రెండు రోజుల్లో కాకపోయినా వారం తిరగకుండానే శేఖరం వచ్చేడు. వచ్చేటప్పుడు పెద్ద బుట్టనిండా మామిడి పళ్ళూ. బస్తాలో మామిడికాయలూ, కొబ్బరికాయలూ, బియ్యం పప్పులు. వూరగాయలు ఒక రిక్షాసామాను వేసుకువచ్చాడు.

గుమ్మంలో అడుగు పెడుతూనే శేఖరం కూతుర్ని కుశల ప్రశ్న వేశాడు.

"ఏమిటమ్మా! అంత త్వరగా రమ్మని వ్రాశావు. ఒంట్లోబాగుందా?"

ఎదురుగా కల్యాణి వుండడమూ, వస్తూనే ఆ ప్రశ్న అడగడముతో సుజాత ఉక్కిరిబిక్కిరి అయింది. తన తండ్రివెంట రాజగోపాలం కూడా వుండడంతో అబద్ధమే ఆడక తప్పిందికాదు.

"మామిడిపళ్ళ రోజులయిపోతున్నా మీకు మా సంగతే జ్ఞాపకం రాలేదు."

"సుజాత మీకోసం బెంగెట్టుకుంది. పాపం! బుచ్చిపాప!"

కల్యాణి పరాచిక మాడింది. కాని, సాధారణమైన ఆ పరాచికంలో సుజాతకు ఎత్తిపొడిపే వినబడింది.

రాజగోపాలం సెలవు పుచ్చుకొని తన వాటాలోకి వెళ్ళిపోయాడు. శేఖరం అతని గుణగానం చేశాడు.

"చాలా మంచికుర్రవాడు. ఎగ్జిక్యూటీవు ఇంజనీరు ఆఫీసులో పనుండి వచ్చా. వెళ్ళేసరికి కనిపించేడు. ఎక్కడో చూసినట్టనిపించింది. వెళ్ళి అయ్యా నాకు ఫలానా పని కావాలన్నా. దగ్గరుండి ఆ పని పూర్తి చేయించాడు. ఈ కుర్రవాడే దొరికివుండకుంటే వారం రోజులు ఆఫీసు చుట్టూ తిరిగినా పని జరిగేదే కాదు."

తన తండ్రీ పొగుడుతూంటే సుజాత మొగం చిట్లించింది. దానిని గమనించి కల్యాణి చిరునవ్వు నవ్వింది.

"ఏ ఆఫీసులోనూ పనులేమిటో తెగ పెరిగి పోతున్నాయి. దానితో సమానాంతరంగా పని చేసేవాళ్ళల్లో బద్ధకం బలిసిపోతూంది."

"యూనియన్లంటారు, సమ్మెలంటారు. జీతాలు ఎక్కువ కావాలంటారు. కాని లంచాలు పుచ్చుకోకూడదనీ, పని జరిగించడంలో శ్రద్ధ చూపాలనీ చెప్పేవాళ్ళు ఒక్కరు కనిపించరు" అన్నాడు శేఖరం.

"ప్రతి చిన్నపనికి త్వరగా కావాలని నాన్నగారే లంచాలు పెడతారు. ఇంజనీర్లకు ఈ వేళ మామిడిపళ్ళ గంపలు తెచ్చారా లేదా నాన్నారూ!"

శేఖరం కూతురు మాటలకు సిగ్గుపడలేదు. నొచ్చుకోలేదు. సన్నగా నవ్వేడు.

"డబ్బు ఇవ్వడానికీ ఖర్చు పెట్టడానికీ బాధ ఏముంటందమ్మా! డబ్బు ఇచ్చినా పనులు జరగడం లేదనికాని .... ...."

పనివాళ్ళలో పని ఎగకొట్టే స్వభావం పెరుగుతూండడం. సంఘశక్తిని దుర్వినియోగం చేస్తూండడం మీద వాక్యోపవాక్యంగా చర్చ నడిచింది.

"రైలు పెట్టెలుంటున్నాయి. పాకీదొడ్లకన్న కనాకష్టంగా వదిలేస్తున్నారు. ప్లాట్‌ఫారంమీద చీపురుకట్టలతో మనుష్యులు కూర్చొని వుంటారు. బాగుచెయ్యండర్రా అంటే తమరి డ్యూటీలో లేమంటారు. క్రిందటి మాటొచ్చినప్పుడు చూడలేకా, చెప్పలేకా, కంప్లెయింట్సు బుక్కులో వ్రాసేను. ఇంక చూడు, వాళ్ళ యూనియనువాళ్ళట, వచ్చి పడ్డారు."

రాజగోపాలం తన అనుభవాన్ని జత కలిపి ఆ మాటను ఆమోదించాడు.

"మా వర్కుషాపులోనూ అదే స్థితి."

"మొన్న స్టేట్ బస్‌డ్రైవరు ఒళ్ళెరుగని సివాలాడిపోయేడు. బస్సుస్టాండు దగ్గర్లో ఫుట్‌పాతమీద ఒక కుటుంబం సామాన్లు పెట్టుక్కూర్చున్నారు. మగవాడు రిక్షాకోసం వెళ్లేడు ఇంతలో ఓ బస్సు బర్రున వచ్చింది. ఆవిడ పిల్లని లాగేసి వెనక్కి పారిపోయింది. బస్సు ఫుట్‌పాత ఎక్కి సామాన్లని దున్నేసింది. పెద్ద గండం తప్పింది. ఆ బెదురుతో ఆవిడ బస్సువాడిని చెడామడా తిట్టింది. కండక్టరు "మీదనుంచి పోలేదని సంతోషించక తిడతావా"యని ఆమెమీదకు లేచేడు. చుట్టూ వున్న వాళ్ళం కలగచేసుకొన్నాం. రిపోర్టు చేశాం. ఆ క్షణంనుంచి యూనియను వాళ్ళు నావెంటబడ్డారు. విన్నారుగా, నిన్న వాళ్ళ ధోరణి, బండిని మీదకు తోలడం, ఈమారు మీదనుంచే తోలుతామని ఆమెను కొట్టబోవడం అన్నీ వెనక్కిపెట్టి "తిట్టడమేమ"ని వాళ్ళ వాదం.

కల్యాణి ఎంతో ఆవేశంతో చెప్పుకుపోయింది. సుజాత అన్నీ వినివిని చిన్న వ్యాఖ్యానం చేసింది.

"ఊళ్లో పనులన్నీ నెత్తినేసుకోడం, జైళ్ళ కెళ్ళడం, ఆస్తులు నాశనం చేసుకొని పెళ్ళాం పిల్లల్ని ఏడిపించటం ఒక గొప్ప ఆదర్శమని వీరంతా నేర్పిందేగా. చదువులు పాడుచేసుకొనీ, వుద్యోగాలు వొదులుకొనీ ఏదో పెద్ద త్యాగం – మహాకార్యం చేసేసినట్లు చెప్పుకొంటూ కూలాళ్ళ కూలిడబ్బుల్లో వాటాలకి సిద్ధపడుతున్న జనం వేలమంది మీ అడుగు జాడల్లో నడుస్తున్నారు. ఇప్పుడు విచారపడి ఏం లాభం?"

తన జీవితం మీదనే కూతురు చేసిన వ్యాఖ్యకి శేఖరం నిర్ఘాంత పడిపోయాడు. తన

# మూడో ప్రకరణం

భోజనంవద్ద కూర్చున్నతర్వాత శేఖరం నెమ్మదిగా కూతుర్ని కబుర్లలో దించడానికి ప్రయత్నించాడు. కాని, ఆమె నిరాకరించినట్లు కిమ్మనకుండా కూర్చుంది. అన్నీ విని చిట్టచివర గంయ్ మంది.

"మీ కూతురు ఎం.ఏ.చదివిందనీ, మంచి వుద్యోగంలో వుందనీ చెప్పుకోగల ప్రతిష్ఠకావాలి మీకు. అంతకు మినహా మా యోగక్షేమాలు మీకు పట్టేయా?"

ఆ అభియోగానికి శేఖరం అదిరిపోయేడు. రామలక్ష్మమ్మ చారుగిన్నెలో పోస్తూ సమాధానం ఇచ్చింది.

"తమ బిడ్డలు బాగున్నారనే ప్రతిష్ఠ కోరడంలో తప్పేముందే. పదిమందీ తన కూతుర్ని వేలుపెట్టి చూపి చెడ్డగా మాట్లాడుకోవడం సంతోషంగా వుండాలంటావా!"

శేఖరం అక్కగారిని వూరుకోమన్నట్లు కనుసైగ చేశాడు.

"ఈ పూట చారు అంత రుచిగా లేదే అక్కా!"

సుజాత తండ్రి ముఖంవంక ఆశ్చర్యంగా తేరిపారి చూసింది.

"ఏం లోపం? చక్కగా వుంటేను?"

రామలక్ష్మమ్మ నవ్వింది.

"ఆపూటకాపూట గిన్నె ఖాళీచేసే వెధవ చారు బాగులేదంటే చూడు అత్తయ్య మాట్లాడ్డంలేదు. నూరేళ్ళ బ్రతుకు బాగుండాలనుకోడంలోనూ, బాగుండేట్టు చేయాలనుకోవడంలోనూ తప్పేముందమ్మా!"

సుజాత పెంకితనంగా మారాం చేసింది.

"నా కింక ఈ పాడుచదువు వొద్దు. నాకు చదవాలని లేదు."

శేఖరం కూతురు మురిపింపును లెక్కచేయలేదు.

"తమ బిడ్డలు తమకంటె సుఖపడాలనీ, బాగుండాలనీ కోరడం సహజం. కాకపోతే మనుష్యజాతి ఈ నాడున్న దశకి రాకనేపోవును."

మాట్లాడుతూ మాట్లాడుతూ చటుక్కున కూతురువేపు తిరిగేడు.

"ఇష్టంలేని చదువు సాగించడంలో అర్థంలేదు. మానెయ్యి పోనీ. పెళ్ళి చేసుకొందుగానీ..."

తన మాటను అంత శీఘ్రంగా తండ్రి వొప్పేసుకోవడంతో సుజాత ఏమీ అనలేకపోయింది.

"నిజంగానేనా?"

"ఆ అనుమానం ఎందుక్కలగాలి? నెలకి నూరు రూపాయలు ఆదా జరిగేపద్ధతిలో...."

"చూసేరా? కేవలం డబ్బులాభం...."

శేఖరం నవ్వేడు.

"ఈ వేళ నీ మనస్సు బాగులేదు. చదువుకోమంటే మా ప్రతిష్ఠ కోసం బాధపడుతున్నా నన్నావు. పోనీ డబ్బు మిగులుతుందంటే. పిల్లల బాధ చూడ్డంలేదంటావు. చదువుకున్న కూతురుతో అన్నీ చిక్కేలా వుంది."

"పొరపాటున మాకు చదువు చెప్పిస్తున్నారు. అంటే మరి కాదంటారేం?"

సుజాత పేచీకి కాలుదువ్వుతున్నట్లనిపించి శేఖరం సంతృప్తి పడ్డాడు. ఆమె మనస్సులో ఏదో వుంటుంది. చెప్పదు. పెద్దవాళ్ళు తెలుసుకోవాలి. ఊహకొచ్చినవేవీ కాదంటుంది. ఆమె మనస్సులో వున్న అంశం కూడా వాటిలో వుండొచ్చు. కాని ఒప్పుకోదు. ప్రతిదానికీ అడ్డం వేస్తుంది. ప్రస్తుతం ఆ ధోరణిలో వుందన్నమాట. ఇందాక కల్యాణివద్ద తెలిపిన భయాలన్నీ వట్టివేననిపించి అతడొక నిట్టూర్పు తీసుకొన్నాడు. ఇంక తానుకూడా చెలగాటం ధోరణిలోకి జారేడు. గమ్మున సుజాత అడ్డుకొంటుంది.

"అదిగో చూడండి. మీరు చెప్పింది చేయించడానికి ఎంత లాయమారుతున్నారు? ఆ మాటల మీద నిలబడండి. నా ఇష్టం వచ్చినవాడిని..."

"కనీసం ఆ మొగుడెవరో నాన్నకేనా చెప్తావా. చెప్పవా?" – అంది రామలక్ష్మమ్మ. సుజాత పులుకూ పులుకూ చూసింది.

"పెళ్లి చేసుకొనేది నేనా..."

ఆమె తనమాట పూర్తి చెయ్యక పోయినా శేఖరమే పూర్తి చేశాడు.

"ఈ రోజుల్లో అల్లుళ్ళు మామగార్లకే మొగుళ్ళు, వాళ్ళ కోరికలన్నీ తీర్చలేక మా గుండెలు గరిసెలు పడిపోతున్నాయి."

"కట్నం కావాలనే మగవాణ్ణి మీరు ఎన్ని బ్రతిమాలినా నే నొప్పుకోనండోయ్."

"మేం బ్రతిమాలడం ఏం వుండదమ్మా. అంతా నీ యిష్టం అన్నాంకదా?"

"చెప్పడానికేం! తీరామోసి ఎదుట పడేసరికి కమ్మారి అబ్బాయేనా? అందులో పెద్దకమ్మారా? చిన్నకమ్మారా? ఎన్ని ప్రశ్నలు..."

"అయితే కులంకూడా దాటిస్తానంటావా యేమే..." – అంది భయంభయంగా రామలక్ష్మమ్మ.

# నాలుగో ప్రకరణం

**“న**మస్కారమండీ!” అంటూ తెల్లవారేసరికి గుమ్మంలో హాజరైన మంగారావును చూడగానే కల్యాణికి చాలా విసువు కలిగింది. అతని వెనకనే నిలబడ్డ ఆర్.టి.సి. కండక్టరు, మరో ఇద్దరూ ఆమె క్రోధాన్ని ద్విగుణీకృతం చేశారు. ఆ కండక్టరు ముఖాన విచారం గాని, పశ్చాత్తాపం గాని వున్నట్లు ఆమెకు అనిపించలేదు. తన నిర్లక్ష్యం వలన ఒక కుటుంబం నిష్కారణంగా చచ్చిపోయి వుండేదే అనే బాధకు బదులు తనకే ఏదో అన్యాయం జరిగిపోయిందన్నట్లు బుంగమూతి పెట్టేడు.

వారిని వీధిలోంచే పంపెయ్యడానికి కల్యాణి ప్రయత్నించి విఫలురాలయింది. ఇంక మర్యాదకోసం వారిని లోనికి పిలవక తప్పలేదు.

“ఏమిటి మళ్ళీ వచ్చారు?”

“తమరిని...”

“ఇల్లాంటి విషయాలలో మీ యూనియనువాళ్లు కలగజేసుకోవడం అప్రతిష్ఠ సుమీ అని మొదటి రోజుననే చెప్పేను. యూనియను సభ్యుడు హత్యలుచేసినా సమర్థించే స్థితికి వచ్చేరా అవి యూనియన్లనిపించుకోవు. రౌడీగాంగులకీ, వాటికి పేరుతేడా మాత్రమే మిగులుతుంది. ఆ మాటకి ఆ రోజున వచ్చిన వెంకటేశ్వర్లుగారట, ఆయన ఔనన్నాడు యూనియను ఈ విషయంలో కలగచేసుకోదన్నాడు. మరి మిమ్మల్నెందుకు పంపేరో...”

“చందాలన్నీ ఇన్నాళ్ళూ జేబులో వేసుకొని, ఈవేళ నీపాట్లు నువ్వు పడమన్నారు లంజకొడుకులు...” అంటూ కండక్టరు దుబ్బు క్రాపు ఎగరేసేడు.

మంగారావు కోప్పడ్డాడు.

“నోరు ముయ్యవోయ్, మొనగాడివి బయలుదేరేవు.”

కండక్టరు భద్రం గప్‌చిప్ మని వూరుకోడం కల్యాణికి ఆశ్చర్యమయింది. ఆమె ఎదుట, వారిచేత తనదే పొరపాటనే మాట చెప్పించలేకపోయాడు వెంకటేశ్వర్లు. అలా చెప్పమనే సరికి ఎంత ఎగిరేడు? ఈ వేళ మంగారావు ‘నోరు ముయ్యమన్నా’ వూరుకోవడం ఆశ్చర్యమే అనిపించింది.

మంగారావే ఆ సందేహం తీర్చేడు.

“యూనియను కమ్యూనిస్టులది. తల్లిగొంతు కొయ్యగలవాడికి పింతల్లి చెవులు

బీరపువ్వులంటారు. దేశానికే ద్రోహం చేసేవాళ్ళు మనిషికి ద్రోహం చెయ్యడంలో ఆశ్చర్యంలేదు. అమాయకుల్ని సంఘాలనే పేరెట్టి ఆడించినంతకాలం ఆడించారు. తీరా సమయం వచ్చేసరికి తప్పుకొన్నారు."

కల్యాణికి పరిస్థితి అర్థం అయింది. ప్రజల ప్రాణాలు, బాధ్యతలు సమస్యలలోకి రాజకీయాలు ప్రవేశించాయన్నమాట.

"ఈ మాట నిన్ననే చెప్పివుంటే ఇంత తకరారు వుండేదికాదు."

మంగారావు సంతోషించాడు. కండక్టరు భద్రం యూనియనును ఒక వరస తిట్టాడు.

"లంజకొడుకులు. పేటలోకి ఎల్లా వస్తారో చూస్తా."

ఈ మారు మంగారావు అతనిని నిరోధించలేదు.

"తమరు పొరపాటులో వున్నారనిపించింది ఈ కేసెంతటిది? మంత్రిదగ్గరి కెడితే ఒక్క నిముషంలో ఆర్డర్లు ప్యాసై పోతాయి. కాని, తమ మంచితనం మీద మచ్చ తొలగదు. అందుకోసం ఆఖరు పర్యాయం. హైద్రాబాదుకు వెళ్లేలోపున మరో ప్రయత్నం చేద్దామనివచ్చా."

కల్యాణి నిశ్శబ్దంగా అన్నీ విని ఒకమాట అందించింది.

"యూనియన్లంటే ఇంతవరకు..."

ఆమె ఏమనుకుంటూందో వినగల ఓపిక మంగారావుకు లేదు. ఆమె తనను యూనియను ప్రతినిధిగా భావించడం చేతనే అంత మొండిగా మాట్లాడిందనే భావం అతనికి ఏర్పడింది.

యూనియన్లలో కమ్యూనిస్టులు చేరి వాటినెల్లా దుర్వినియోగం చేస్తున్నారో గుక్కతిప్పు కోకుండా చెప్పేడు.

"ఈమధ్య రైల్వేవాళ్ళలోనూ ఇలాంటిదే వచ్చింది. పెట్టెలు బాగు చెయ్యలేదని ఎవరో ప్రయాణీకుడు కంప్లెయింటు చేశాడట. అధికార్లు వెంటనే ఇద్దర్ని సస్పెండు చేశారు. వాళ్ళ తరఫున నిలబడ్డానికి బదులు యూనియను పని అశ్రద్ధచేశారని వాళ్ళని కోప్పడింది, రెండోవేపున స్టాఫ్ చాలడంలేదనీ, మరికొంతమందిని వెయ్యాలనీ మహజర్లూ గంద్రగోళం ప్రారంభించారు. అబ్బే! ఏ అవకాశం దొరికినా చాలు, గవర్నమెంటుమీద బ్రహ్మాస్త్రంలా ప్రయోగించడమే గాని..."

కల్యాణి ఇంక భరించలేక పోయింది. గతరాత్రి జరిగిన సంభాషణ గుర్తుకొచ్చింది. వెంటనే వెళ్ళి శేఖరాన్ని పిలిచింది. ఆ హడావిడి చూసి రాజగోపాలం వచ్చేడు. అంతమంది శ్రోతలముందు తన సిద్ధాంతాలను చెప్పగల అవకాశం దొరకడం మంగారావుకు ఎంతో ఉత్సాహం కలిగించింది.

# అయిదో ప్రకరణం

**రా**జగోపాలంగారికోసం ఎవరో వచ్చినట్లున్నారని రామలక్ష్మమ్మ చెప్తుంటే కల్యాణి తలుపు తీసింది.

"రాజగోపాలం అనే జూనియరు ఇంజనీరు ... ...."

"ప్రక్కవాటాయే నండి. వారు .... ...."

"నా కుమారుడు."

ఆఫీసుకు వెళ్ళేరనదలుచుకొనికూడా ఆగి లోనికి ఆహ్వానించింది.

"దయచేయండి. వారు ఆఫీసుకు వెళ్ళేరు."

లోనికి తప్పుకోబోతున్న కల్యాణి ఆయన పిలుపునకు నిలబడింది.

"చూడండి."

"ఎండలో నిలబడ్డారు."

"ఫర్వాలేదు, మావాళ్ళుకూడా వచ్చారు, ఆమెగారు ఇక్కడుంటుంది. నేనుపోయి అతనిని కలుసుకువస్తా."

"ఇంకా చెప్పేరు కాదేం, ఎక్కడున్నారు వారు?"

కల్యాణి ఆయన వెనువెంట వెళ్ళింది.

"మీ అబ్బాయిగారున్న ఇల్లు ఇదే, దయచెయ్యండి"

"అబ్బాయి వున్నాడా?"

కృష్ణంరాజే సమాధాన మిచ్చాడు.

"వారు ప్రక్కవాటావారు. అతడిని నే తీసుకొస్తా, నువ్వు వారింట్లో వుండు."

"వెడుదురుగాని లెండి, దిగి కాస్సేపు కూర్చోండి." అంటూ కల్యాణి ఆహ్వానించింది.

ఆమె చేతి ఆసరా తీసుకొని సావిత్రమ్మ రిక్షా దిగింది.

"వెయ్యికాలాలపాటు వర్ధిల్లుతల్లీ!"

కల్యాణి చిరునవ్వుతో ఆశీర్వచనం స్వీకరించింది.

"ఇల్లా రాండి."

గుమ్మంలో రామలక్ష్మమ్మ స్వాగతం ఇచ్చింది. సావిత్రమ్మ చిరునవ్వుతో ప్రశ్నించింది.

"మీ కూతురా? మంచిదమ్మా! అదృష్టవంతులకు గాని అల్లాంటి సంతానం లభించదు."

"ఈ రోజుల్లో మాటమర్యాద తెలిసిన వాళ్ళెందరమ్మా!" అని మెచ్చుకోలులో భార్యకు వంతకలిపాడు కృష్ణంరాజు.

కల్యాణి చిరునవ్వు నవ్వింది. రామలక్ష్మమ్మనూ, సుజాతనూ పరిచయం చేసింది.

"తమరిప్పుడు ఆయనకోసం వెళ్ళొద్దు. ఆఫీసైతే దగ్గరే అనుకోండి. కాని, ఎండ మండిపోతూంది. ఒక్కక్షణం కూర్చోండి. స్నానం చేయండి."

రామలక్ష్మమ్మ ఆమెను బలపరచింది.

"అల్లా చెయ్యండి. ఎప్పుడు బయలుదేరేరో కాస్సేపు విశ్రాంతి తీసుకోండి."

సావిత్రమ్మ అంగీకరించింది.

"తెల్లవారగట్ల ఎప్పుడో బయలుదేరాం."

"ఎప్పుడో తొమ్మిదింటికి రావలసిన బండి. ఇప్పుడు మూడయింది."

కృష్ణంరాజు దంపతులు కబుర్లలో కలిసిపోయారు. కేవలం ఆడవాళ్ళమధ్య కూర్చుండి కబుర్లు చెప్పడానికి ఏలాగో వున్నా అరవయ్యేళ్ళు దాటాక బెజవాడవేడిని తట్టుకోవడానికి జంకే కలిగింది.

"పట్నంలో ఒకరిసంగతి వేరొకరు పట్టించుకోవడమే అరుదమ్మా. ఇదివరకు మావాడు మరోచోట వుండేవాడు. అదెక్కడో నాళ్ళనడుమ వుంది. చీకటి పడింది. వెతికి వేసారా. ఒక ఇంట్లో జరిగింది చెప్తా. ఇంట్లో ఆడమనిషి ఎదురుగా కనిపిస్తూంది. మాట్లాడదు."

"ఘోషా యేమో" నంది సుజాత.

కృష్ణంరాజు అసంతృప్తిగా తలతిప్పేడు.

"రాజసాలు సాగినప్పుడూ. దివాణంలో ఏ మారుమూలనో వుండేటందుకు అవకాశం వున్నప్పుడూ ఘోషా సాగించినా అర్థం వుంది. ఏ కాసావాడో, దాసీమనిషో సమాధాన మిస్తుంది. దోసెడు కొంపలో, మారుబట్ట లేని దరిద్రంలో...."

"ఘోషా అనేది సరైన పద్ధతే అనుకొంటే ఇంటి వైశాల్యం, మనిషి ఐశ్వర్యంతో పనేముంటుంది? జరిగించుకోవలసిందే." అంది కల్యాణి.

సావిత్రమ్మ నవ్వింది.

"మంచి వుజ్జీవే దొరికావు. వారికి వాదం వుంటే ప్రసాదం కూడా అక్కర్లేదు."

భార్య మాటలు రుజువు పరుస్తున్నట్లు కృష్ణంరాజు హుషారుగా అందుకొన్నాడు.

"మన ఆచారాలూ, అలవాట్లూ మధ్యలో వచ్చినవే. మధ్యలో పోయేవే. ఆడుదాన్ని చేలోపుగా వుంచుకొనేటందుకు ఇంట్లో మూసిపెట్టాల్సిందే ననుకొన్నారు. ఆడదాన్ని

# ఆరో ప్రకరణం

**జీ**వితంలో ఎదురుపడ్డ వాళ్ళంతా తమవైపే ఆకలిగా చూస్తున్నారనే హెచ్చరిక కొందరిని అనుక్షణం వెంబడిస్తూంటుంది. ఎవరో తట్టి చూపించేవరకూ తమ ఎదుట కనిపిస్తున్న వాటినికూడా చూడలేరు కొందరు.

సరిగ్గా కల్యాణి విషయంలో జరిగిందంతే. బహుశా అది తన మనస్సును కూడా గుర్తించకపోవడం వలన కావచ్చు. రాజగోపాలం పెళ్ళి విషయంలో తల్లిదండ్రుల్ని ధిక్కరించడం సంతోషంకన్న సానుభూతి చూపవలసిన విషయంగా ఆమెకు తోచిందంటే మరో అర్థంలేదు. గట్టిగా నిలబడమనీ, మేమంతా నీ ప్రక్క నున్నామనీ దిలాసా ఇవ్వడం అవసరమన్నంత వరకే ఆమె ఆలోచనలు వెళ్ళేయి.

"కులంకాని కులంలోంచి భార్యను ఏరుకుంటాడేమోనన్న భయం ఎందుకు కలగాలి? మీ అబ్బాయి చాలా యోగ్యుడు. తల్లిదండ్రుల మాట కాదనడు లేండి."– అంటూ రామలక్ష్మమ్మ ఊరడించినా ఆ దంపతులకు విశ్వాసం కలగలేదు. విశ్వాసం కలగక పోవడానికి తగిన ఘటనలేం జరగలేదు. అసలు కొడుకును చూడకుండానే, అతనితో మాట్లాడకుండానే వారిలో ఆ అవిశ్వాసం ఏర్పడింది. దానికి కారణం అవసరంలేదు. అంతస్సాక్షి సూచన.

అనుకొన్నట్లుగానే రాజగోపాలం తల్లిదండ్రుల ప్రతిపాదనలన్నింటినీ నిరాకరించాడు.

ఒకరోజు రోజంతా తల్లిదండ్రులూ, కొడుకూ తమ వాటా విడిచి బయటకు రానేలేదు. మధ్య మధ్య వినిపించిన రంకెలతో కృష్ణంరాజు కంఠం చర్చాంశాన్ని నలుగురికీ వివరించింది.

ఎంత వినకూడదనుకున్నా ఏవేవో మాటలు చెవిని పడుతూనే వున్నాయి. రెండు వాటాల మధ్యనున్న తలుపులూ, గోడలూ వారి రహస్యాలను కాపాడలేకున్నాయి.

పడుచుల ఆకారాలు, వారి తండ్రులివ్వగల కట్నాలు – కానుకలు వారి కుటుంబాలు చేకూర్చగల ప్రతిష్ఠలు ఉదాత్తానుదాత్త స్వరితాలలో కృష్ణంరాజు కొడుకు మనస్సుకు పట్టించ ప్రయత్నిస్తున్నాడు. కాని, అవన్నీ విఫలమైనట్లే తెలిసిపోయింది.

"చేతి కందుబాటులో వున్నదని నాటక మాడాలనుకుంటున్నావేమో. ఆస్తంతా నా స్వార్జితం." – అంటూ కృష్ణంరాజు ఇచ్చిన అంతిమసందేశం వినబడ్డా, ఆయన పేర్కొన్న

పిల్ల తానేనేమోననే అనుమానంకూడా ఆమెకు కలగలేదు. ఆ బెదరింపును కొడుకేమాత్రం లక్ష్యంచేశాడో కూడ ఆమె వినలేదు.

ఆ మాట విన్న రామలక్ష్మమ్మ కృష్ణంరాజును అభినందించలేకపోయింది.

"ఒక మూల ఆస్తికీ, పెళ్ళికి లంకెపెడుతూ, రెండోవేపున అది దైవనిర్దిష్టం అని ఆత్మవంచన చేసుకోవడం దేనికో?"

తెల్లవారగట్ల ఎవ్వరితోనూ చెప్పకుండా కృష్ణంరాజు భార్యతో రైలుకి వెళ్ళిపోయాడు.

ఆ రోజు నుంచీ రాజగోపాలం తమరందరినీ తప్పించుకు తిరుగుతున్నట్లనిపించింది కల్యాణికి. వివాహ విషయంలో తల్లిదండ్రుల్ని ధిక్కరించినందుకు తామంతా తప్పుపడతా మనుకున్నాడేమో. తమ వివాహ విషయంలో తమ ఇష్టమే చెల్లాలని కోరే యువకులు ఎందరున్నారు? ఎన్నో బాసలు చేస్తారు. కలలు కంటారు. కోపగించి కొన్నాళ్ళు తిండి తిప్పలు మానేస్తారు. కాని చివరకు తండ్రి గద్దింపో, తల్లి ముద్దింపో, ఆస్తి బద్దింపో, బంధువుల ప్రోత్సాహమో ఏదో ఒకటి దిగతీసేస్తుంది. చప్పబడి జీవితాన్ని ప్రవాహంలో వదిలేస్తారు. కొంతకాలం వెనకటి ఆశలు మనస్సుల్ని ఎరియపెడతాయి. తరువాత మరిచిపోతారు. మంచి కీలక సమయంలో కాస్తమాట ఆసరా, చేయూత దొరికిన వాళ్ళు తమ కోరికల్ని ఫలింపచేసుకొంటున్నారు. తల్లిదండ్రులు అంగీకరించి చేసిన వివాహాలకన్న ధిక్కరించి చేసుకొన్నవి తక్కువ. సుఖబడడం లేదని నిరూపించారు. బంధువుల్నీ, ఆస్తుల్నీ, స్వజనాన్నీ – సమాజాన్నీ కూడ ధిక్కరించి ఆశయాలకోసం ఎంతైనా త్యాగం చెయ్యగలరు.

కల్యాణి ఆలోచన ప్రకారం రాజగోపాలం ప్రస్తుతం ఆ పరిస్థితిలో వున్నాడు. తమకున్న పరిచయంతో తాను ఆ ఆసరా ఇవ్వడంకి తగివున్నానని కూడా అనుకుంది.

కాని, అతడే ఆ అవకాశం ఇవ్వలేదు. వెనుకటికన్న ముందే ఇంట్లోంచి లేచిపోతున్నాడు. చాలా ఆలస్యంగా వస్తున్నాడు. అతడెందుకు తప్పించుకు తిరుగుతున్నాడో ఆమెకు అర్థం కాలేదు. నాలుగు రోజుల అనంతరం ఒక సాయంకాలం అతడు డాక్టరు మంజులత యింట్లో తేనీటి విందులో ఎదురయ్యాడు. ఆమె చెల్లెలు పరీక్ష ప్యాసయినందుకు టీ పార్టీ ఇచ్చింది. ఆశ్చర్యం, సంతోషం కలిగాయి.

"మా ఇంజనీరుగార్ని నువ్వెరుగుదువా?"

మంజులత కల్యాణి ఈడుదే, విశాఖపట్నంలో చదువుతున్నప్పటి నుంచి ఇద్దరికీ స్నేహం వుంది. ఇప్పుడామెయే కళానికేతనం హైస్కూలుకు వైద్య సలహాదారు. కల్యాణి కళానికేతనంలోనే పని చేస్తూంది.

"మీ ఇంజనీరంటే?"

మంజులత అనని మాటను వూహించుకొని కల్యాణి ముఖం జేవురించింది. మంజులత పరీక్షగా చూసింది "ఏం కథ?"

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Kattula+Vantena**

* * *